

మున్సిపాలిటీలకు భారీగా నిధులు

- మెదక్ జిల్లాకు యూఐడీఎఫ్ కింద రూ.63.5 కోట్లు
- మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ పట్టణాలలో అభివృద్ధి పనులు

మెదక్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మున్సిపాలిటీలలో నిధుల కొరత వేధిస్తున్న తరుణంలో అత్యవసర పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు కేటాయించింది. దీంతో యూఐడీఎఫ్ (అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్ మెంట్ ఫండ్) కింద పురపాలికల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆమోదం లభించింది. మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీల కమిషనర్లు గతంలోనే ప్రతిపాదనలు పంపడంతో ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయి. ప్రధానంగా ఈ నిధులతో సీసీ రోడ్లు, మురికి కాల్వలు నిర్మాణాలతో పాటు తాగునీటి వసతి, కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. రెండు నెలల క్రితమే మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాధికారులు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారుచేసి సీడీఏఎం కార్యాలయానికి పంపారు. వాటికి మరికొంత మొత్తం కలిపి నిధులు కేటాయించాలని రాష్ట్ర సర్కార్ సూచించింది.

మెదక్ పురపాలికకు రూ.18.5 కోట్లు

మెదక్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.15 కోట్లు అంచనాలతో ప్రతిపాదనలు అధికారులకు పంపారు. పట్టణంలో పెండింగులో ఉన్న సుందరీకరణ పనులు, కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3.70 కోట్ల వాటా కలపగా మొత్తం రూ.18.70 కోట్ల నిధులు మెదక్ మున్సిపాలిటీకి మంజూరయ్యాయి. జనాభా ప్రాతిపదికన గ్రేడ్-2 మున్సిపాలిటీ కిందకు రావడంతో మిగతా పురపాలికల కన్నా అధికంగా నిధులు మంజూరు అయినట్లు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున యూఐడీఎఫ్ నిధులు మంజూరయ్యాయి.

విచారణ అధికారిగా హైదరాబాద్ డీసీహెచ్ఎస్ ?

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో(టీవీవీపీ) జరుగుతున్న లంచాల డిప్యూటేషన్ల వ్యవహారంలో వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణ అధికారిని నియమించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్ డీసీహెచ్ఎస్‌ను విచారణ అధికారిగా నియమించినట్లు తెలిసింది. 27న 'వైద్య శాఖలో పైసా వసూల్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని సర్కారు సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టీవీవీపీ కమీషనర్.. విచారణ అధికారిని నియమించగా, త్వరలో ఆ అధికారి సంగారెడ్డికి విచ్చేసి సమగ్ర విచారణ జరిపే అవకాశముంది. గతంతో పాటు ఇటీవల తాజాగా డిప్యూటేషన్లు ఇచ్చిన వ్యవహారంపై సుదీర్ఘంగా విచారణ జరిపేందుకు విచారణ అధికారి అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

సంగారెడ్డి మున్సిపాలిటీకి రూ. 18.70కోట్లు సదాశివపేట మున్సిపాలిటీకి రూ. 18.70 కోట్లు

- సీఎం రేవంత్‌రెడ్డితో మంజూరు చేయించిన జగ్గారెడ్డి, నిర్మల
- రెండు మున్సిపాలిటీలకు కలిపి రూ.37.40కోట్లు మంజూరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు



సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలకు విడుదలైన నిధుల వివరాలను వెల్లడిస్తున్న జగ్గారెడ్డి, పక్కన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల

సంగారెడ్డిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో పలు అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రూ.37.40కోట్లు మంజూరు చేయించారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంటు ఫండ్ (ఏఐడీఎఫ్) కింద నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జగ్గారెడ్డి, నిర్మల తెలిపారు.

సదాశివపేట మున్సిపాలిటీలో..

సదాశివపేట మున్సిపాలిటీకి మంజూరు అయిన 18.70కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టనున్నట్లు నిర్మలా జగ్గారెడ్డి వివరించారు.

- రూ.1.50కోట్లతో సదాశివపేటలోని ఊబ చెరువు సుందరీకరణ
- రూ.50లక్షలతో గాంధీ చౌక్ సుందరీకరణ
- రూ.1.60కోట్లతో అయ్యప్ప ఆలయం నుంచి పీఎస్ఎల్ వరకు సెంట్రల్ మీడియం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- రూ.50లక్షలతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిసరాల్లో కనీస సౌకర్యాలు
- రూ.30లక్షలతో పట్టణంలో హైమాస్ట్ లైటింగ్
- రూ.50లక్షలతో గురునగర్ కాలనీలో పార్కు డెవలప్‌మెంటు.

సంగారెడ్డి మున్సిపల్ పరిధిలో..

- రూ.2కోట్లతో విలీన గ్రామాలలో సీసీ రోడ్లు
- రూ.8.26కోట్లతో ఇంటర్నల్ సీసీ రోడ్లు
- రూ.5.09కోట్లతో వరద నీరు మళ్లింపు కోసం ప్రత్యేక డ్రైన్‌ల నిర్మాణం
- రూ.1.35కోట్లతో రాజీవ్ పార్కు అభివృద్ధి
- రూ.2కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

స్మార్ట్‌గా దోచేస్తూ..



- సీసీ కెమెరాలున్నా ఎక్కడా చిక్కని ఆనవాళ్లు
- రెక్కీ నిర్వహించి మరీ చోరీలు
- తాళాలు వేసిన ఇళ్లే కాదు... కార్లలోని నగదు అపహరణ
- సంగారెడ్డిలో వరుస ఘటనలు
- ప్రజల్లో తీవ్ర ఆందోళన

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో దొంగలు రెచ్చిపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వరుస చోరీలుకు పాల్పడుతున్నారు. ప్రజల సొమ్మును యథేచ్ఛగా దోచుకుంటున్నారు. సీసీ కెమెరాల నిఘాకు చిక్కకుండా చాకచక్యంగా కాజేస్తున్నారు. రెండు నెలల కాలంలో చోటుచేసుకున్న హైటెక్ చోరీ ఘటనలు జిల్లావాసుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

ట్రెండ్ మార్చిన దొంగలు

గతంలో దొంగలు ఎక్కువగా తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడేవారు. కానీ, తాజా ఘటనలను పరిశీలిస్తే దొంగలు తమ పంథాను పూర్తిగా మార్చినట్లు తెలుస్తోంది.

ఇళ్ల వద్ద రెక్కీ : ఏ ఇంట్లో ఎక్కువ బంగారం, నగదు ఉందో తెలుసుకోవడం, ఆ ఇంటికి తాళం ఎప్పుడు పడుతుందో మిగతా 8వ పేజీలో

సంగారెడ్డి పట్టణం వసంత్‌నగర్ కాలనీలో ఉండే ఓడీఎఫ్ ఉద్యోగి రాములు ఈనెల 26న ఇంటికి తాళం వేసి నారాయణఖేడ్ వెళ్లగా, అదే రోజు రాత్రి దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. ఇటీవల ఆయన ప్లాట్ అమ్మగా వచ్చిన రూ.25 లక్షల నగదుతో పాటు 30 తులాల బంగారం బీరువాలో పెట్టగా దాన్ని ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. ఇంటి పరిసరాల్లో నాలుగు సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ, దొంగతనం దృశ్యాలు దేనిలోనూ రికార్డు కాకపోవడం గమనార్హం.

పటాన్‌చెరు మండలం బీరంగూడకు చెందిన ఎల్లబోయిన శ్రావణ్‌కుమార్ ఈ నెల 17న తన కారులో రూ.1.50 లక్షల నగదుతో కంది రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చాడు. కార్యాలయం సమీపంలో కారు నిలిపి లోనికి వెళ్లి తిరిగి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి అపహరించారు.

హైదరాబాద్‌కు చెందిన ముజఫర్ ఈనెల 14న ప్లాట్ కొనుగోలు కోసం రూ.20 లక్షలను తీసుకుని సంగారెడ్డికి వచ్చాడు. పట్టణంలోని క్లాసిక్ గార్డెన్ వద్ద కారు నిలిపి సమీపంలోని తన స్నేహితుడి వద్దకు వెళ్లి వచ్చేలోగా గుర్తు తెలియని వ్యక్తులు అద్దాలు పగులగొట్టి నగదును దొంగిలించారు.

సంగారెడ్డికి చెందిన ఓడీఎఫ్ విశ్రాంత ఉద్యోగి నర్సింహారెడ్డి సెప్టెంబరు 11న కారులో బ్యాంకుకు వెళ్లి రూ.54 వేలు విత్‌డ్రా చేసి వచ్చాడు. తన కిరాణా షాప్ పక్కన కారు నిలిపారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి ఆ నగదును చోరీ చేశారు.

స్మార్ట్ టౌన్‌లో నిద్రపోతున్న నిఘా నేత్రాలు

సంగారెడ్డిని స్మార్ట్ టౌన్‌గా మారుస్తున్నామని, రూ.8 కోట్లతో పట్టణంలోని పలు కూడళ్ల వద్ద హైరిజల్యూషన్‌తో కూడిన 360 డిగ్రీల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని అధికారులు ప్రకటించారు. అయితే, పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతున్నప్పటికీ, ఏ ఒక్క సీసీ కెమెరా కూడా చోరీకి సంబంధించిన దృశ్యాలను లేదా దొంగలను గుర్తించకపోవడం శోచనీయం. నిఘా వ్యవస్థ కేవలం ప్రకటనలకే పరిమితమైందని పట్టణ ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

మొంథా... చింత





బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను ప్రభావం సంగారెడ్డి, మెదక్ జిల్లాలను తాకింది. బుధవారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి దాకా ముసురుతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ముందస్తు హెచ్చరికలు చేయడంతో రైతులు అప్రమత్తమయ్యారు. తమ ధాన్యాన్ని తడవకుండా ఏర్పాట్లు చేసుకున్నారు. అయినప్పటికీ పలుచోట్ల వ్యవసాయమార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం నిల్వలు తడిసి ముద్దయ్యాయి. నేడూ తుఫాను తాకిడి ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఈ సీజన్‌లో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

జిల్లా	కురవాల్సిన వర్షపాతం	కురిసింది
సంగారెడ్డి	757	1066
మెదక్	754	1366



ఖేడ్ మండలం వెంకటాపూర్‌లో మొలకెత్తిన ధాన్యం



చిన్నశంకరంపేటలో ధాన్యం రాసులపై కప్పిన టార్పలిన్లు



కల్హేర్ మండలం ఇందిరానగర్ సమీపంలో..

- సంగారెడ్డి, మెదక్ జిల్లాలో తుఫాను ప్రభావం
- రోజంతా కురిసిన జల్లులు
- కొండాపూర్‌లో అత్యధికంగా 38.6 మి.మీ.ల వాన
- మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- నేషనల్ హైవేపై వాహనాలకు అంతరాయం
- అలర్ట్‌గా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

సంగారెడ్డి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఈ సీజన్‌లో వర్షాలు దంచికొడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షపాతం నమోదవుతున్నది. తాజాగా మొంథా తుఫాను కారణంగా మళ్లీ వర్షం బెడద తప్పలేదు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చితే తుఫాను ప్రభావం తక్కువగానే ఉన్నప్పటికీ బుధవారం రోజున ముసురుతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు నేషనల్ హైవేపై వాహనాలకు తీవ్ర అంతరాయం కలిగింది.

కొండాపూర్‌లో అత్యధికంగా..

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలో అత్యధికంగా 38.6 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అదే విధంగా మిగతా 8వ పేజీలో



తడిసిన ధాన్యానికి చికిత్స

చిలప్‌చెడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షంతో తడిసిన దాన్యాన్ని కాపాడు కోవడానికి రైతులు చేయని ప్రయత్నాలు అంటూ లేవు. సాధారణంగా టార్పలిన్లను కప్పడం, ఎండ వచ్చాక మళ్లీ ఆరబెట్టడం వంటివి చేస్తుంటారు. కానీ, మండలం పరిధిలోని చండూరులో ఓ రైతు కొత్తరకం చికిత్స చేశాడు. గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి ధాన్యం పూర్తిగా తడవగా బుధవారం ఆరబెట్టిన వడ్లపైన రెండు క్వింటాళ్ల ఉప్పును చల్లాడు. ఇలా ఉప్పు చల్లడం వల్ల ధాన్యం పాడవదని, మొలకలు రావని ఎవరో చెప్పడంతో అలా చేశామని ఆయన తెలిపారు.

సస్తా బజార్ మార్కెట్ ఆఫర్ పేరిట కుచ్చుటోపి



సస్తా బజార్ వాట్సాప్ గ్రూప్

చిన్నశంకరంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సస్తా బజార్ మార్కెట్ ఆఫర్ పేరిట పలువురు సైబర్ మోసానికి గురైన ఘటన చిన్నశంకరంపేటలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళలు ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రమోషన్‌లను చూసి దీపావళి ఆఫర్‌తో (సస్తా బజార్) బజార్ ఫేక్ యాప్‌లో దుస్తుల మార్కెటింగ్‌ను నమ్మి డబ్బు చెల్లించారు. ఓ వాట్సాప్ గ్రూప్‌లో జాయిన్ అయితే నచ్చిన డ్రెస్సులను తీసుకోవచ్చని అమయాకులను మాయమాటలతో బురిడీ కొట్టించారు. ఫేక్ వాట్సాప్ గ్రూప్ జాయిన్ అయిన బాధితులకు డిస్పాస్ ఛార్జెస్ పడుతున్నాయని మరో డ్రెస్ కొనుగోలు చేయాలని మరో ఆఫర్ తగిలే అవకాశం ఉందని సూచించడంతో మరికొన్ని డబ్బులు చెల్లించారు. మళ్లీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ బాధితుల ఫోన్ నంబర్లను బ్లాక్ చేశారు. కేటుగాళ్ల ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వస్తుందని గమనించిన బాధితులు సస్తా బజార్ మార్కెట్ యాప్ మోసం అనితెలుసుకున్నారు. ప్రజలు ఫేక్ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లింక్‌లు ఓపెన్ చేయొద్దని, జాగ్రత్త వహించాలని పోలీసులు సూచిస్తున్నారు.

నిమ్జ్, ఆర్ఆర్ఆర్ పనుల్లో వేగం పెంచండి

- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన పారిశ్రామిక ప్రాజెక్టులకు అనుగుణంగా భూసేకరణలో వేగం పెంచాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన రైతులకు అందించే పరిహారంలో జాప్యం లేకుండా అందించాలన్నారు. నిమ్జ్ సంబంధించిన భూసేకరణ అనంతరం సొంత హక్కులు, బాధ్యతలు అధికారికంగా సంస్థకు బదిలీ అయ్యే ప్రక్రియ పూర్తి ప్రభుత్వం భూమిని ప్రత్యేక ప్రయోజన సంస్థ స్పెషల్ పర్పస్ వేహికిల్‌కు అందించాలని సూచించారు. జాతీయ రహదారి 65 విస్తరణలో భాగంగా చేపట్టిన సర్వీస్ రోడ్లు పనులు అడ్డంకులు లేకుండా కొనసాగేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి విశాలాక్షి, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌సాగుకు రైతులు ముందుకు రావాలి

నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ఆయిల్‌పామ్‌పై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పండరి, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ శివప్రసాద్, డీసీవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

గుండ్రెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో మళ్లీ కనిపించిన చిరుత



గుండ్రెడ్డిపల్లి అడవిలో గుట్టపైన చిరుత

తూప్రాన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో బుధవారం మళ్లీ చిరుత పులి కనిపించింది. నెల రోజుల క్రితం చిరుత పులి కనిపించినా చోటే మళ్లీ చిరుత పులి కనిపించినట్లు గ్రామస్థులు తెలిపారు. గుండ్రెడ్డిపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో మల్కాపూర్ - దాతర్‌పల్లి మార్గంలో రోడ్డుకు సమీపంలో ఉన్న గుండుపై చిరుత సేద తీరుతుండగా గ్రామస్థులు గుర్తించారు. సెప్టెంబరు నెలాఖరులో సైతం ఇదే గుండుపై చిరుత కనిపించింది. చిరుత కనిపించడంతో రైతులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : మెదక్ కలెక్టర్

చేగుంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. కేంద్రం వద్ద ఉన్న రైతులను గ్రామాల్లో ఎంత శాతం వరి కోతలు అయ్యాయని అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్‌లు ఉంచుకోవాలని నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను వెనువెంటనే మిల్లులకు తరలించాలన్నారు. తుఫాన్ ప్రభావం ఉన్నందున వరి కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు.

పీసీ-పీఎన్‌డీటీ యాక్టు అమలు చేయకపోతే లైసెన్సు రద్దు

సంగారెడ్డి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పీసీ-పీఎన్‌డీటీ యాక్టు అమలు చేయకపోతే రిజిస్ట్రేషన్ లైసెన్సు రద్దు చేస్తామని సంగారెడ్డి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల తెలిపారు. సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం పీసీ అండ్ పీఎన్‌డీటీ జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా పీసీ పీఎన్‌టీడీ(ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్-గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేద చట్టం) యాక్టు నియమ నిబంధనలు పాటిస్తూ, ప్రతీ నెల ఆన్‌లైన్ రిపోర్టులను హార్డ్ కాపీ రూపంలో డీఎంహెచ్‌వో ఆఫీసుకు తప్పకుండా పంపాలని సూచించారు. ఆదేశాలు పాటించకపోతే చర్యలు తీసుకోవాలని అడ్వైజరీ కమిటీ నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. ఇటీవల రాష్ట్ర టాస్క్ ఫోర్స్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని పైకమిటీకి సిఫారసు చేసినట్లు వివరించారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లకు సంబంధించిన కొత్త రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్ దరఖాస్తులపై చర్చించినట్లు తెలిపారు.

జీజీహెచ్‌లో చెయ్యి ఇన్‌ఫెక్షన్‌పై విచారణ

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : తీవ్రమైన కడుపునొప్పితో సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందడం, పైగా ఎడమ చెయ్యి ఇన్‌ఫెక్షన్‌కు గురైన ఘటనపై ఆస్పత్రి అధికారులు విచారణ ప్రారంభించారు. జనరల్ సర్జరీ విభాగాధిపతితో పాటు అనస్తేషియా విభాగాధిపతుల సమక్షంలో విచారణ నిర్వహించారు. పేషెంట్ వచ్చిన రోజు విధుల్లో ఉన్న క్యాజువాలిటీ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిని ఒక్కొక్కరి నుంచి వ్యక్తిగతంగా పిలిపించి విచారణ చేశారు. వారి నుంచి లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌ను సమర్పించనున్నామని ఆస్పత్రి అధికారులు తెలిపారు.

కారం, ఆయిల్ తగ్గించండి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్
- జ్యోతిబాపులే గురుకులం తనిఖీ, మధ్యాహ్న భోజనం పరిశీలన
- తూప్రాన్‌లో సుడిగాలి పర్యటన



తూప్రాన్ గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

తూప్రాన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో కారం, ఆయిల్ (నూనె) తగ్గిస్తూ వంటకాలు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ వంట మనిషికి సూచించారు. నాన్ వెజ్ వంటకాల్లో కారం ఎక్కువగా ఉండటంతో కలెక్టర్ కొంత అసౌకర్యానికి గురయ్యారు. బుధవారం తూప్రాన్ మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టిన కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డీఓ జయచంద్రారెడ్డితో కలిసి రావెల్లి శివారులోని మహాత్మా జ్యోతిబా పులే గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. వంట గది, వంట సరకులు, వండిన భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ డివిజన్ కార్యాలయాల సముదాయంలోని భవన నాణ్యతను, నమూనాను పరిశీలించారు. భవనంలో వర్షపు నీరు రావడంపై ఇంజనీర్‌ను ప్రశ్నించారు. తూప్రాన్ పట్టణానికి మంజూరైన అర్బన్ పీహెచ్‌సీ ఏర్పాటుకు పుట్టకోటలోని ఎస్సీ హాస్టల్ భవనాన్ని పరిశీలించి, భవన నిర్మాణానికి స్థలం, విధానం గురించి ఆరా తీశారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ, సర్వే అధికారులతో ట్రిపుల్ ఆర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒక సర్వే నంబర్ వ్యత్యాసంపై కమిటీ వేసి పరిశీలన చేయాలని సూచించారు. తూప్రాన్ మండలంలో 8 గ్రామాల్లో భూసేకరణ చేస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. అందులో 17 అవార్డులు(విడుతల్లో) పంపించగా, 13 అవార్డులను ఆమోదించినట్లు వివరించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో శాలికా తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి మల్లన్న ఆలయ మహామండపంలో దీపారాధన చేస్తున్న అర్చకులు,మహిళలు

ఆలయాల్లో కార్తీక దీపోత్సవం



నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో..

కొమురవెల్లి/వర్గల్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం పవిత్ర కార్తీకమాస దీపోత్సవం నిర్వహించారు. కార్తీక శుద్ధ అష్టమిని పురస్కరించుకొని ఆలయ మహామండపంలో 8వ రోజు గణేష అధర్వణ శీర్ష పారాయణం, లలితా సహస్ర నామ పారాయణం గావించి దీపోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు ఆలయాధికారులు, అర్చకులు దీపపు ప్రమిదలు, పూజాసామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఈవో టంకశాల వెంకటేష్, ఆలయాధికారులు, అర్చకులు,తదితరులు పాల్గొన్నారు. నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో దీపారాధన నిర్వహించారు. ఆలయ మండపంలో భక్తులు వివిధ ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామరాజు పర్యవేక్షణలో కార్తీక మాసోత్సవాలు జరుగుతున్నాయి.

రూ.లక్ష కోట్లతో గ్రామీణ బ్యాంకుల కార్యకలాపాల విస్తరణ

- లబ్ధిదారులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- తెలంగాణ గ్రామీణాభివృద్ధి బ్యాంకుల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



లబ్ధిదారులకు చెరుకు కోత యంత్రాలను అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

జహీరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 2028 మార్చి 31నాటికి రూ.లక్ష కోట్లతో తెలంగాణ మంజీర గ్రామీణ బ్యాంకుల్లో కార్యకలాపాలను విస్తరించనున్నట్లు తెలంగాణ గ్రామీణాభివృద్ధి బ్యాంకుల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం జహీరాబాద్‌లోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ మంజీర గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూ.6 కోట్ల వ్యయంతో 6 మంది రైతులకు చెరుకు కోత యంత్రాలను, మహిళా సంఘాల సభ్యులకు మరో రూ.6 కోట్ల రుణాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణవ్యాప్తంగా రూ.77 వేల కోట్లతో 934 తెలంగాణ మంజీరా గ్రామీణ బ్యాంకులు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. త్వరలో మరో 25 బ్యాంకుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. నాబార్డు డీడీఎం కృష్ణమూర్తి, ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ మేనేజర్ సమత, వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

- తృటిలో తప్పిన ప్రమాదం

నారాయణఖేడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓవర్ లోడ్‌తో వస్తున్న లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. అయితే, ఆ సమయంలో అక్కడ ప్రజలు, వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే, మంగళవారం రాత్రి కంగ్టి వైపు నుంచి ఖేడ్ వైపు వస్తున్న ఓ లారీ మున్సిపల్ పరిధిలోని నెహ్రూనగర్ హనుమాన్ ఆలయ సమీపంలో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. దీంతో భారీ శబ్దంతో విద్యుత్ తీగలు తెగిపడటంతో జనాలు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన తర్వాత గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

గుంతను తప్పించబోయి..

- ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం



ఖమ్మంపల్లి రోడ్డులో అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లిన ఆర్టీసీ బస్సు

మునిపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఖమ్మంపల్లి రోడ్డులో గుంతను తప్పించబోయి, రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దిగిపోయింది. అయితే, డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ కొట్టి ఆపడంతో పెను ప్రమాదం తప్పింది, ప్రయాణికులు, విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. సదాశివపేట నుంచి బోడపల్లికి రోజు మాదిరిగానే బుధవారం ఉదయం ఈ బస్సు చిన్నచెల్మెడ, ఖమ్మంపల్లి గ్రామాల మీదుగా వస్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రయాణికులు ఇతర వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకోగా, బస్‌పాస్‌లు ఉన్న విద్యార్థులు చేసేదేమీ లేక మునిపల్లి మోడల్ స్కూల్, కళాశాలకు నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది.

అప్పుడు మక్తక్యాసారం రోడ్డులో..

గతంలో జులై 30న తాటిపల్లి నుంచి మక్తక్యాసారం రోడ్డును తవ్వేసి వదిలేయడంతో మరో ఆర్టీసీ బస్సు గుంతలో పడింది. ఆ ఘటన మరువకముందే, ఇటీవల ఆగస్టు 22న రోడ్డు పనులు ప్రారంభించిన ఖమ్మంపల్లి-మునిపల్లి రోడ్డును తవ్వేయడంతో కంకర తేలి ఈ ప్రమాదం జరిగిందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్విన రోడ్ల పనులను వెంటనే ప్రారంభించి, ప్రమాదాలు జరగకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

మెదక్ అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నీలిమ బుధవారం తీర్పునిచ్చినట్లు అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. గతేడాది నవంబర్‌లో గోసిక విజయ్, విలియమ్స్‌తోపాటు మరో స్నేహితుడి మెదక్ పట్టణంలోని గాంధీనగర్ వచ్చారు ఈ సమయంలో తన కుమారుడు జైలుకు వెళ్లడానికి విజయ్ కారమణని విలియమ్స్ ఆరోపిస్తూ.. వాగ్వాదానికి దిగారు. నిన్ను చంపుతానని విజయ్‌ను బెదిరించాడు. ఆవేశంతో విలియమ్స్ తలపై విజయ్ కొట్టి హత్య చేశాడు. ఈ ఘటపై కేసు నమోదు చేసుకున్న అప్పటి పట్టణ సీఐ నాగరాజు సమగ్ర విచారణ జరిపి సాక్ష్యా ధారానుల సేకరించారు. ప్రస్తుత ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మహేష్ సాక్షులను ప్రవేశ పెట్టి పూర్తి సాక్ష్యాధారానుల సమర్పించారు. విచారణ అనంతరం నిందితుడు విజయ్‌కు జీవిత ఖైదుతోపాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నీలిమ తీర్పుఇచ్చారు.

నీటి కుంటలో పడి యువకుడి మృతి



చంద్రపాల్ మృతదేహం

జిన్నారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి యువకుడు మరణించిన ఘటన గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్యపల్లిలో చోటు చేసుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చంద్రపాల్ (25) ఉపాధి కోసం వచ్చి కిష్టయ్యపల్లి నివాసం ఉంటూ ఓ వాటర్ ప్లాంట్ లో పని చేస్తున్నాడు. బుధవారం కిష్టయ్యపల్లి గ్రామ శివారులోని ఓ నీటి కుంటలో పడి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఔట్‌సోర్సింగ్ అక్రమాలకు ఆధార్‌తో చెక్

- ఉద్యోగుల ఆధార్ అనుసంధానానికి చర్యలు
- ఆధార్ ఇవ్వనివారికి ఈ నెల జీతాలు బంద్
- ఆగమేఘాలపై వివరాలు సేకరిస్తున్న ఏజెన్సీలు
- ఉమ్మడి జిల్లాలో 14900 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఔట్‌సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులందరి వివరాలను తప్పనిసరిగా ఆధార్ కార్డుతో అనుసంధానించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ వివరాలు నమోదు చేయని వారికి ఈ నెల వేతనాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం చెప్పడంతో, ఏజెన్సీలు హడావుడిగా ఉద్యోగుల నుంచి వివరాలు సేకరిస్తున్నాయి.

అక్రమాలకు అడ్డుకట్ట

ఉద్యోగులను నియమించకుండానే రికార్డుల్లో చూపించి, లేని ఉద్యోగుల పేరిట వేతనాలు కాజేస్తున్నారనే ఆరోపణలు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై ఉన్నాయి. ఇటీవల సచివాలయంలో జరిగిన తనిఖీల్లో ఇలాంటి అక్రమాలు వెలుగులోకి రావడంతో, ప్రభుత్వం ఈ కఠిన చర్య తీసుకుంది. ఆధార్ అనుసంధానం ద్వారా రికార్డుల్లో ఉన్న ఉద్యోగులు వాస్తవంగా పనిచేస్తున్నారో లేదో తెలుసుకోవచ్చు, తద్వారా బోగస్ పేర్ల మీద జీతాలు తీసుకోవడం నిలిచిపోతుంది.

ఉమ్మడి జిల్లాలో 14900 వేల మంది

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో దాదాపు 14900 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మెదక్ జిల్లాలో 10 వేల మంది, సిద్దిపేటలో 4 వేలు, సంగారెడ్డిలో 900 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐడీ కార్డు, సర్వీసు బుక్ వంటి ఆధారాలు ఉన్నప్పటికీ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి గుర్తింపు లేదు. ఈ నేపథ్యంలో, ఆధార్ అనుసంధానం ద్వారా వారికి ఓ ప్రాథమిక గుర్తింపు లభించినట్లవుతుంది. అయితే, వివాహిత మహిళా ఉద్యోగులకు ఆధార్‌లో పేరు మార్పుల (పెళ్లికి ముందు, తర్వాత) కారణంగా చిన్నపాటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతానికి ఉన్న ఆధార్ వివరాలు సమర్పించాలని, తర్వాత అప్‌డేట్ చేసుకోవచ్చని ఏజెన్సీలు సూచిస్తున్నాయి.

నెలనెలా సమస్యలే

సిద్దిపేట జిల్లాలోని దాదాపు 40 ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. కనీస వేతన చట్టం ప్రకారం రూ.18 వేలు ఇవ్వాల్సి ఉన్నా, ఏజెన్సీలు కేవలం రూ.12 వేల నుంచి రూ.14 వేలు మాత్రమే ఇస్తూ, మిగతా మొత్తాన్ని నొక్కేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక, ఉద్యోగుల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ కోసం కట్ చేసిన డబ్బులను కూడా ఏజెన్సీలు సక్రమంగా చెల్లించడం లేదని తెలుస్తోంది. నిలదీస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామనే బెదిరింపులు ఉండటంతో ఉద్యోగులు వెట్టిచాకిరీ చేస్తున్నారు.

ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలి

వేతనాల్లో ఏజెన్సీల అక్రమాలకు చెక్ పెట్టాలని, కార్పొరేషన్ ద్వారా లేదా ప్రభుత్వమే నేరుగా తమకు జీతాలు చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

వివరాల నమోదులో ఏజెన్సీల నిర్లక్ష్యం

మెదక్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులు 8 వేల మంది, పెన్షనర్లు 3,300 మంది ఉన్నారు. ఆధార్ నంబర్ అనుసంధానం చేయని ఉద్యోగుల వేతనాలు నిలిపివేయాలని రాష్ట్ర ఖజానా డైరెక్టరేట్‌కు ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేయడంతో ఇప్పటికే వారంతా తమ వివరాలను సమగ్ర ఆర్థిక నిర్వహణ సమాచార వ్యవస్థ(ఐఎఫ్ఎంఐఎస్)లో అప్‌లోడ్ చేసుకున్నారు. కానీ మెదక్ జిల్లావ్యాప్తంగా పలు శాఖలలో పనిచేస్తున్న 10వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మాత్రం ఎలాంటి వివరాలు అప్‌లోడ్ చేసుకోలేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాల నమోదులో ఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ట్రెజరీ అధికారులు చెబుతున్నారు. కనీసం ఆధార్ నంబర్ కూడా లింక్ చేయలేదని తెలిపారు. ఇదే అదునుగా ఏజెన్సీలు అక్రమంగా జీతాలు డ్రా చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు ఆధార్ అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఈ నెల 25 వరకు ఆధార్ వివరాలు నమోదు చేసుకోవాలని ఉత్తర్వులు వెలువడ్డాయి.

మల్కాపూర్ నర్సరీలో పనులు షురూ

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


నర్సరీని శుభ్రం చేసిన దృశ్యం


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తూప్రాన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ ఆదర్శ గ్రామంలోని నర్సరీలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మొక్కలు నాటారు.. నిర్వహణ మరిచారు' అంటూ కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఎంపీడీవో శాలికా తేలు, ఎంపీవో సతీష్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులను సక్రమంగా నిర్వహించాలని, నర్సరీని బాగు చేయాలని హెచ్చరించారు. దీంతో నర్సరీలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు.

భగవద్గీత కంఠస్థ రాష్ట్ర స్థాయి పోటీలకు కల్హేర్ బాలుడు


ప్రణవ్‌కు మెరిట్ పత్రం అందజేస్తున్న స్వామి స్వరూపానంద

కల్హేర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చిన్మయా గీతా చాంటింగ్(కంఠస్థ) కాంపిటీషన్ పోటీల్లో భగవద్గీతలోని కొన్ని భాగాలను కంఠస్థంతో జపించి, కల్హేర్‌కు చెందిన కరణం ప్రణవ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కరణం అనంతరావు, నీలిమ దంపతుల కుమారుడైన ప్రణవ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 28న బేగంపేటలోని స్వామి చిన్మయానంద గురుకుల పాఠశాలలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ జపించే (చాంటింగ్) జిల్లా స్థాయి పోటీల్లో 169 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రణవ్‌ను ప్రపంచ చిన్మయ మిషన్ ప్రముఖులు స్వామి స్వరూపానంద, చిన్మయానందలు మెరిట్ పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలు నవంబరు 9న ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో జరగనున్నాయి. చిన్న వయసులోనే ప్రణవ్ భగవద్గీతను కంఠస్థం చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై కల్హేర్ ప్రజలు అభినందించారు.



మాజీ మంత్రి హరీశ్‌రావుకు బండి సంజయ్ పరామర్శ

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు స్వర్గస్థులైన విషయం తెలిసిందే. దీంతో బుధవారం హరీశ్‌రావును పలువురు పరామర్శించారు. కేంద్ర మంత్రి బండిసంజయ్‌తో కలిసి ఎమ్మెల్సీ అంజిరెడ్డి హరీశ్‌రావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. సత్తనారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి బండిసంజయ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

వన్యప్రాణుల గణనపై శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న రామాయంపేట రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్

చేగుంట , అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల గణన ప్రక్రియ ద్వారా అడవుల్లో జీవ వైవిధ్యంపై విలువైన సమాచారం లభిస్తుందని రామాయంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్ రావు పేర్కొన్నారు. బుధవారం వల్లూరు సెంటర్ ఫారెస్ట్ నర్సరీలో రామాయంపేట రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన జాతీయ వన్యప్రాణుల గణన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు డిసెంబర్‌లో వారం రోజులపాటు వన్య ప్రాణుల గణన ఉంటుందన్నారు. మూడు రోజులపాటు శాకాహార వన్యప్రాణులు, మూడు రోజులపాటు మాంసాహార వన్యప్రాణులపై గణన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాంతంలో వన్యప్రాణుల సంఖ్య వాటి కదలికలు నివాస స్థలాల వివరాలను నమోదు చేయడం ఎంతో ముఖ్యమని వివరించారు. సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సాంకేతిక పద్ధతులతో లెక్కింపు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తూప్రాన్ రేంజ్ ఆఫీసర్ అంబర్ సింగ్, టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ప్రతినిధి బాపు రెడ్డి, మెదక్ డివిజన్ ఫారెస్ట్ రేంజ్ అధికారులు, రామాయంపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీత, సెక్షన్ ఆఫీసర్లు , బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గోల్డ్‌మెడల్ అందుకున్న శ్రీహరి

సిద్దిపేట జిల్లావాసికి గోల్డ్ మెడల్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన గూడెపల్లి శ్రీహరి రాజస్థాన్ గవర్నర్ హరిభాను బగాడే చేతులమీదుగా రెండు బంగారు పతకాలు అందుకున్నాడు. రాజస్థాన్ ఉదయపూర్‌లోని ఇంజనీరింగ్ కళశాలలో చదువుతున్న శ్రీహరి అకాడమిక్ ఇయర్‌లో కాలేజీ టాపర్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్‌లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించాడు. ఈ సందర్భంగా నిర్వహించిన కాన్వకేషన్‌లో గవర్నర్ హరిభాను బగాడే గోల్డ్ మెడల్స్ అందజేసి అభినందించారు.

సింగూరు ప్రాజెక్టుకు వరద

● ఒక క్రస్ట్‌గేట్ ఎత్తి దిగువకు విడుదల


క్రస్ట్‌గేట్ ద్వారా వరద జలాలు విడుదలవుతున్న దృశ్యం

పుల్‌కల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం వచ్చి చేరుతున్నది. పక్షం రోజుల కిత్రం వరకు పది గేట్ల వరకు ఎత్తి వరద నీటిని దిగువకు వదిలిన విషయం తెలిసిందే. బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పక్షం రోజుల అనంతరం సింగూరు ప్రాజెక్టులోకి మళ్లీ వరద ప్రవాహం వస్తున్నది. ప్రాజెక్టుకు ఎగువన సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లోని మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాల్లో కురిసిన వర్షానికి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతున్నది. బుధవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 11, 877 క్యూసెక్కులు నమోదైంది. దీంతో నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు 14వ క్రస్ట్‌గేట్‌ను రెండు మీటర్లు ఎత్తి 9,649 క్యూసెక్కుల వరదను దిగువన ఉన్న మంజీర జలాశయానికి వదులుతున్నారు. జల విద్యుత్ ఉత్పత్తి గేట్ ద్వారా 2,433 క్యూసెక్కులు మొత్తం ఔట్ ఫ్లో 12,082 క్యూసెక్కులుగా నమోదైంది. ఇదిలావుండగా, జిల్లా కేంద్రమైన సంగారెడ్డి సమీపంలోని మంజీర జలాశయం ఒక క్రస్ట్‌గేట్‌ను రెండు మీటర్లు, స్కవర్ గేట్ ఒకటి మీటరున్నర ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లుగానే ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

జీవితంలో క్రీడలది కీలక భూమిక

● ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డి


మాట్లాడుతున్న చిన్నప్పరెడ్డి

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒకరి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో, సృజనాత్మకతను, శ్రేయస్సును పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని వరల్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అలయన్స్ బోర్డు డైరెక్టర్, గ్లోబల్ కమ్యూనిటీ హెల్త్ టెక్నికల్ హెడ్ ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డి అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్పోర్ట్స్ డైరెక్టరేట్, గస్టో 2025-26 పేరిట నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్-విశ్వవిద్యాలయ, అంతర్-కళాశాల క్రీడా పోటీలను బుధవారం ఆయన జ్యోతి ప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తమ ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా ఎంపిక చేసుకుని, జీవితాన్ని కొనసాగించాలన్నారు.

జాతీయ సదస్సు ప్రారంభం

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల ద్విభాషా జాతీయ సదస్సును బుధవారం వేగా కన్వేయర్స్ అండ్ ఆటోమేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ గరిమెళ్ల ప్రారంభించారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)లోని భారతీయ భాషాభివృద్ధి, పోషణకు మద్దతు పథకం సౌజన్యంతో దీనిని ఏర్పాటు చేశారు.

ప్రపంచ కూటమిలో ఐఐటీహెచ్

కంది, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సోలార్ ప్యానెల్ రీసైక్లింగ్ కోసం జీరో-కార్బన్ సిలికాన్ రిఫైనింగ్ లక్ష్యంగా గ్లోబల్ కన్సార్టియం (ప్రపంచ కూటమి)లో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ చేరింది. మేక్ ఇన్ ఇండియా, క్లీన్ ఎనర్జీ, సర్క్యులర్ ఎకానమీ కోసం ఈ ఉన్నత కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యం అయింది. ఈ మేరకు ఐఐటీహెచ్ అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సౌర సంస్థాపనల నేపథ్యంలో సిలికాన్ రికవరీ, వనరుల సర్క్యులారిటీ, క్లీనర్ ఎనర్జీలు కీలకంగా మారనున్నాయి. జీవితాంతం ఉపయోగించలేని సౌర ఫలకాలను రీసైక్లింగ్ చేయడం లక్ష్యంగా సిలికాన్ రిఫైనింగ్ టెక్నాలజీలను అభివృద్ధి చేయడానికి ఐఐటీహెచ్ ఆస్ట్రేలియాలోని స్విన్‌బర్న్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నేతృత్వంలోని గ్లోబల్ కన్సార్టియంలో చేరింది. భారతదేశం, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, యూఏఈ నుంచి అధిక స్వచ్ఛత సిలికాన్‌ను తిరిగి పొందడానికి ఆకుపచ్చ, వృత్తాకార విధానాలను అభివృద్ధి చేస్తుంది. ఇందు కోసం 3 మిలియన్ల డాలర్లను ఈ ప్రాజెక్ట్ కోసం ఆస్ట్రేలియన్ ప్రభుత్వం నిధులు సమకూరుస్తుంది. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఈ సహకారం ద్వారా భారతదేశంలో పెరుగుతున్న క్లీన్ ఎనర్జీ ఎకోసిస్టమ్‌కు సౌర రీసైక్లింగ్‌ను ఆచరణాత్మకంగా ప్రభావవంతంగా చేసే సమర్థవంతమైన, స్కేలబుల్ రిఫైనింగ్ పద్ధతులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

అర్బన్ పార్కుకు హైటెక్ హంగులు


త్వరలో అందుబాటులో రానున్న నీటిలో నిర్మించిన అధునాతన సదుపాయల కాటేజీలు

- నర్సాపూర్ ఫారెస్ట్‌లో ఏర్పాటు
- నీటి మధ్యలో 40 కాటేజీల నిర్మాణం
- త్వరలో పర్యాటకులకు అందుబాటులోకి
- నీటిలో తేలియాడుతున్న అనుభూతినిచ్చేలా నిర్మాణం

నర్సాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌కు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో, జాతీయ రహదారి పక్కనే ఉన్న నర్సాపూర్ అర్బన్ పార్కు పర్యావరణ ప్రేమికులకు, పట్టణ వాసులకు ఆహ్లాదకరమైన ఆటవిడుపు కేంద్రంగా మారింది. సహజసిద్ధమైన అడవిలో ఏర్పాటు చేసిన ఈ పార్కులో ఇప్పటికే పచ్చని చెట్లను చూస్తూ నడవడానికి వీలైన సుమారు రెండు కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్ ఉంది. అలాగే, ఎత్తైన ప్రాంతంలో నిర్మించిన వాచ్ టవర్ పార్కుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీనిపై నుంచి చుట్టూ ఉన్న అటవీ ప్రాంతాన్ని, నర్సాపూర్ పట్టణాన్ని వీక్షించవచ్చు. సెలవు దినాలలో హైదరాబాద్ నుంచే పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు.

హైటెక్ కాటేజీలు త్వరలో ప్రారంభం

పర్యాటకుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో, అర్బన్ పార్కుకు మరింత ఆకర్షణను జోడిస్తూ, పార్కుకు సమీపంలో ఉన్న రాయరావు చెరువు పక్కన హైటెక్ తరహాలో అన్ని వసతులతో 40 కాటేజీలు నిర్మించారు. త్వరలో ఇవి అందుబాటులోకి రానున్నాయి. వీటిని నీటి మధ్యలో నిర్మించడంతో పర్యాటకులు లోపల సేద తీరినప్పుడు నీటిలో తేలియాడుతున్న అనుభూతిని పొందవచ్చు. కాటేజీల వద్దే పర్యాటకుల కోసం స్విమ్మింగ్ పూల్, బ్యాంక్వెట్ హాళ్లతో పాటు రెస్టారెంట్ కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే, పర్యాటకులు పార్కులో తిరిగి, కాటేజీలలో ఉండి, అక్కడే రుచికరమైన భోజనాన్ని ఆస్వాదించవచ్చు. దీంతో నర్సాపూర్ అటవీ ప్రాంతం పర్యాటకపరంగా మరింత ప్రసిద్ధి చెందడం ఖాయం .


కాటేజీల సమీపంలోనే పర్యాటకుల కోసం స్విమ్మింగుపూలు

విజిలెన్స్ అవగాహన కార్యక్రమం

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారోత్సవాలలో భాగంగా, రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శృతికీర్తి ఆధ్వర్యంలో అధికారుల బృందం బుధవారం నర్సాపూర్ అర్బన్ పార్కును సందర్శించింది. ఈ సందర్భంగా అధికారులు పార్కులో మొక్కలు నాటారు. అంతేకాక, నర్సాపూర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల చేత విజిలెన్స్ అవగాహన ప్రతిజ్ఞ కూడా చేయించారు.


అర్బన్‌పార్కులోని వాచ్‌టవర్

హరిత రెస్టారెంట్‌ను వినియోగంలోకి తెస్తాం

● పరిశీలించిన పర్యాటక శాఖ డిప్యూటీ కలెక్టర్ రామ్మూర్తి



కోహీర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా, కోహీర్ మండలంలోని కవెల్లి చౌరస్తా వద్ద గత కొన్ని రోజులుగా మూతపడి నిరుపయోగంగా ఉన్న హరిత రెస్టారెంట్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టనున్నట్లు పర్యాటక శాఖ డిప్యూటీ కలెక్టర్ రామ్మూర్తి తెలిపారు. పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశాల మేరకు ఆయన ఈ రెస్టారెంట్‌ను పరిశీలించారు. రాష్ట్రంలో మొత్తం 28 హరిత రెస్టారెంట్లు ఉన్నాయని, వాటిలో అవసరం ఉన్న ప్రాంతాల్లోని రెస్టారెంట్లను పర్యాటకులను దృష్టిలో ఉంచుకొని మరింత మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. మూతపడిన రెస్టారెంట్లను గుర్తించి, అవసరం ఉన్నచోట వాటిని తిరిగి పునఃప్రారంభించడానికి కృషి చేస్తామని, అవసరమైతే కొన్ని చోట్ల బార్లను ఏర్పాటు చేసే ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తుందని ఆయన తెలిపారు. కవెల్లి రెస్టారెంట్‌ను పునఃప్రారంభించాలా లేదా అనే అంశంపై మరోసారి పరిశీలన చేసి నిర్ణయం వెల్లడిస్తామని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు వాహనాలకు వేలం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎన్‌డీపీఎస్ కేసుల్లో పట్టుబడిన పది వాహనాలను గురువారం వేలం వేయనున్నట్టు సంగారెడ్డి ఎక్సైజ్ సీఐ ఎండీ.నజీర్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ వేలం పాల్గొనాలని కోరారు.

'పార్కులోని సమస్యలను పరిష్కరించాలి'

నారాయణఖేడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని ఆక్సిజన్ పార్కులో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్కులోని ఓపెన్ జిమ్‌లో పలు పరికరాలు విరిగిపోయి పాడయ్యాయన్నారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణం కోసం గోతులు తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయన్నారు. అందువల్ల పార్కులోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రమాదకరమైన బావిని పూడ్చండి

మనూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మనూరు నుంచి మాయికోడ్ వెళ్లే రహదారి పక్కన ఉన్న ప్రమాదకరమైన బావిని పూడ్చి వేయించాలని గ్రామానికి చెందిన నగేష్‌తోపాటు పలువురు బుధవారం ఎంపీ సురేష్‌షెట్కార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 25న బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అదుపు తప్పి బావిలో పడి మృతిచెందిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావికి ఎలాంటి కంచె లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అందువల్ల ఆ బావిని పూడ్చేయించాలని కోరారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దశంకరంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న మహిళా అసిస్టెంట్ వంట మనిషి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపల్ విజయ బుధవారం తెలిపారు. 18-40 ఏళ్ల వయస్సు ఉండి, ఏడో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులన్నారు. నవంబరు 2వ తేదీలోపు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి : సీఐ

నర్సాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్లు తమ వాహనాలు నడిపే సమయంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రంజిత్ కుమార్‌రెడ్డి, జనార్దన్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడొద్దు

శివ్వంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ మధుకర్‌రెడ్డి హెచ్చరించారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రమైన శివ్వంపేట, పలు గ్రామాల్లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.

విద్యార్థులకు రోబోటిక్ శిక్షణ

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సోహం అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని ఎంఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రోబోటిక్‌లో శిక్షణ అందించారు. ఈ శిక్షణలో భాగంగా విరోబోటిక్స్, ప్రాథమికాలు, హార్డ్‌వేర్ పరిజ్ఞానం, ప్రాజెక్టు డిజైన్, ప్రాక్టికల్‌లో ట్రైనర్లు శిక్షణ అందించారు. కొంతకాలంగా సోహం అకాడమీ తెలంగాణలోని 27 జిల్లాల్లో 493 పాఠశాలలు, 56 కళాశాలల్లో శిక్షణ అందించినట్టు నిర్వాహకులు తెలిపారు.

తిరుమల చేరిన స్వాముల మహాపాదయాత్ర

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి నుంచి బయలుదేరిన అయ్యప్పస్వాములు మహాపాదయాత్ర బుధవారం తిరుమల చేరుకున్నది. ఈ నెల 6న సంగారెడ్డిలోని నవరత్నాలయం నుంచి 30 మంది అయ్యప్పస్వాముల బృందం శబరిమలకు బయలుదేరిన విషయం తెలిసిందే. కాగా కాణిపాకం, అరుణాచలం మీదుగా శబరిమలకు పాదయాత్ర చేరుకోనున్నది. ఇప్పటివరకు 650 కి.మీ. పాదయాత్ర పూర్తి చేసుకుందని గురుస్వామి సాహితీరాము తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

జిన్నారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం కాజీపల్లిలో ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది రమాకాంత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్‌వీఎం ఆసుపత్రికి చెందిన డాక్టర్లు, వైద్య సిబ్బంది స్థానికులకు కంటి, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి : మహిపాల్‌రెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చెరువుల్లోకి మురుగు వెళ్లనివ్వకుండా అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో పటాన్‌చెరు డివిజన్, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పటాన్‌చెరులోని సాకి, బండ్లగూడ దోశంచెరువు, రామచంద్రాపురంలోని రాయసముద్రం చెరువుల్లోకి మురుగు ప్రవాహం రానివ్వకుండా అడ్డుకునే ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే సుందరీకరణ పనులు ప్రారంభించాలని తెలిపారు. కావాల్సిన నిధులు సమీకరణ చేస్తానని తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధి పోచారం గ్రామంలో పాలిటెక్నిక్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడానికి భూకేటాయింపులు జరుపుతున్నారని చెప్పారు. నూతనంగా ఏర్పడిన పురపాలక గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా విషయంలో ఇబ్బందులు రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డిసెంబరులో సింగూరు డ్యాం మరమ్మతులు చేయనున్నందున ఏడాదికాలం పాటు నీటి సరఫరా నిలుస్తుందన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని ఇంటింటికి సరఫరా అయ్యేటట్టు ముందస్తు ప్రణాళికలు వేసుకోవాలని కోరారు. భానూరు, క్యాసారం, నందిగామ, గుమ్మడిదల మండలంలోని అనంతతారం, కానుకుంట, కొత్తపల్లి, ముంబాపూర్, నాగిరెడ్డిగూడెం, నల్లవెల్లి, రామిరెడ్డిబావి, వీరారెడ్డిపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధుల కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. తెల్లాపూర్ పురపాలక పరిధి కర్ధనూరు, ఘన్‌ఉర్, వెలిమెల, కొల్లూరు, తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ గ్రామాల్లో రూ.6.80 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు యాదగిరి, ఉమాదేవి, కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఈఈ విజయలక్ష్మి, డీఈ హరీష్, శ్రీనివాస్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ బ్లాక్‌లో సేవలు ప్రారంభించండి

● సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సంగారెడ్డి జీజీహెచ్‌లో సదరం క్యాంపు ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జీజీహెచ్ ప్రాంగణంలో నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌ను అందుబాటులోకి తీసుకురావడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. వెంటనే అత్యవసర సేవలు ప్రారంభించాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహణకు రూ.10 లక్షలతో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, జనరల్ ఓపీతో సంబంధం లేకుండా క్యాంపు నిర్వహణకు వారంరోజుల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆస్పత్రి అధికారులతో పాటు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు అన్ని విభాగాల హెచ్‌వోడీలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా.వి.మురళీకృష్ణ, డీఆర్‌డీవో ఏపీడీ సూర్యారావు, సీఎస్ ఆర్ఎంవో డా.వీ రాంజనేయులు, ఆర్ఎంవో డా.రవికుమార్, వైద్యులు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో ఎమ్మెల్యే



మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి వర్షంలో ప్రచారంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, నాయకులు

నారాయణఖేడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా బుధవారం రాత్రి మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, ఖేడ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మాజీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహేర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముంతాజ్, నాయకులు శివరాథోడ్, సిద్ధారెడ్డి, పండరి రెడ్డి, గౌస్ చిస్తీ, శ్రీకాంత్, దిల్‌దార్‌ఖాన్, షారుక్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాగా జూబ్లీహిల్స్ ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన సమావేశంలోనూ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని దిశానిర్దేశం చేశారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : ఎమ్మెల్యే

నర్సాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మొంథా తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పాంబండ, ఖాజీపేట, సంగాయిపేట, రంగంపేట, చిన్నఘనపూర్, వరిగుంతం, చిలప్‌చెడ్ తదితర గ్రామాల్లో కోసిన ధాన్యం నీట మునిగిందన్నారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనలు పెట్టకుండా కొనుగోలు చేయాలన్నారు. అదేవిధంగా నర్సాపూర్ నియోజకవర్గంలో పంట నష్టం వివరాలు కూడా అధికారులు సేకరించాలన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సదాశివపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మంజీరా రైతు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం సదాశివపేటలో రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు వెంకట్రావు, రవీందర్, గంట శివన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే ఆటలపై ఆసక్తి పెంచాలి



గుర్తింపుపత్రాన్ని అందుకుంటున్న సర్దార్ దల్ జిత్‌సింగ్

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చదువుకుంటున్న సమయంలోనే క్రీడల పట్ల ఆసక్తి పెంచేటట్టు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్దార్ దల్‌జిత్‌సింగ్ అన్నారు. బుధవారం తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామం కృష్ణవేణి పాఠశాల ప్రాంగణంలో ఒలింపిక్ జ్యోతి వెలిగించి క్రికెట్ పోటీలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై పట్టు సాధించేటట్టు ప్రోత్సహించాలని తెలిపారు. రానున్న రోజుల్లో క్రీడాకారులకు రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని వివరించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి బసవరాజ్, ఎంవో నాగేశ్వర్‌నాయక్, ఓక్‌లీ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ రాజు సంగాని, సీనియర్ కోచ్ ఖాజా, ప్రిన్సిపాల్ రాజేష్ తదితరులు ఉన్నారు.

మానవసేవే మాధవ సేవ

మనోహరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మానవసేవే మాధవ సేవ అని వజీఈ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మనోహరాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహిపాల్‌రెడ్డి వారి తల్లిదండ్రులు చిట్కుల లక్ష్మీ,రాంరెడ్డి జ్ఞాపకార్థం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు దుస్తులు, ఆట వస్తువులను పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి హాజరై మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ప్యాక్స్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్

● జిల్లా ఉద్యానవన అధికారి ప్రతాప్‌సింగ్ రాథోడ్



మొలకెత్తిన విత్తనాలను నాటుతున్న అధికారులు

నిజాంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుచేయడం ద్వారా రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి ప్రతాప్‌సింగ్ రాథోడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో బుధవారం లీవ్ ఫామ్ రిసోర్సెస్, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ నర్సరీలో మొలకెత్తిన విత్తనాలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్‌పామ్ పంటలకు పెద్దఎత్తున రాయితీలతో ప్రోత్సహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీవ్ ఫామ్ డైరెక్టర్ రంగనాయకులు, ఏడీఏ రాజ్ నారాయణ, ఏవో సోమలింగారెడ్డి, హెచ్‌వో రచన పాల్గొన్నారు.

పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



గాయపడ్డ బాలికను వివరాలు అడుగుతున్న ఆర్డీవో

రామాయంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పిల్లల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కస్తూర్బా ప్రిన్సిపాల్‌కు మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. బుధవారం ఆమె రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రజావాణి ఫిర్యాదులు, భూభారతి, రెవెన్యూ సదస్సుల వివరాలపై తహసీల్దార్ రజనీకుమారిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆర్డీవో ఇటీవల కస్తూర్బాలో మెట్ల పైనుంచి పడి గాయపడ్డ విద్యార్థిని ప్రియాంక ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిబ్బందితో జిల్లా ఇంటర్ విద్యాధికారి మాధవి

రామాయంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అధ్యాపకులు విద్యార్థుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి మాధవి సూచించారు. మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా తమ పనితీరు ఉండాలన్నారు. బుధవారం రామయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హిమజ్యోతితో పాటు సిబ్బందితో గంటపాటు సమావేశమయ్యారు. ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులకు అవగాహన వచ్చేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

నారాయణఖేడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపల్ పరిధిలో గృహాల నిర్మాణాలకు సంబంధించి మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించొద్దని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు అవసరమైన వారు బిల్డ్‌నౌలో ఆన్‌లైన్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫీజులను సైతం ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉంటే దరకాస్తు చేసిన 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తామన్నారు. ఏమైనా అనుమానాలు ఉంటే తనను కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

స్మార్ట్‌గా దోచేస్తూ..

(5వ పేజీ తరువాయి)

రెక్కీ నిర్వహించి మరీ కన్నం వేస్తున్నారు. వసంతనగర్ ఘటన దీనికి నిదర్శనం.

ఆర్థిక కేంద్రాలే లక్ష్యం : దొంగలు అత్యధికంగా డబ్బు చెలామణి అయ్యే ప్రాంతాల్లో నిఘా పెడుతున్నారు. ముఖ్యంగా రిజిస్ట్రార్ కార్యాలయం, బ్యాంకులు, ఇతర ఆర్థిక లావాదేవీలు జరిగే ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తున్నారు.

కారు అద్దాలు పగులగొట్టి : బ్యాంకుల నుంచి లేదా కంది రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి అధిక మొత్తంలో నగదు తీసుకుని వాహనాల్లో వెళ్తున్న వారిని దొంగలు వెంబడిస్తున్నారు. అదును చూసి వాహనాలను పార్కింగ్ చేసిన వెంటనే కారు అద్దాలు పగులగొట్టి నగదును అపహరిస్తున్నారు. కంది రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన వాహనాలపై జరిగిన రెండు చోరీ ఘటనలు దీనిని స్పష్టం చేస్తున్నాయి.

ఇప్పటికైనా పోలీసులు స్పందించి, దొంగతనాలను అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మొంథా.. చింత

(5వ పేజీ తరువాయి)



కల్హేర్: ఉధృతంగా ప్రవహిస్తున్న మహారాజు వాగు



వెల్దుర్తి : కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల మధ్య వర్షపు నీరు

న్యాల్‌కల్, జహీరాబాద్, కోహీర్, కంది, పుల్కల్, గుమ్మడిదల, సదాశివపేట మండలాల్లోనూ మోస్తరు వర్షం కురిసింది. ఇక మెదక్ జిల్లాలోని అన్ని మండలాల్లో ముసురు కమ్మేసింది. నేడు తుఫాను ప్రభావంతో పలుచోట్ల మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సంకేతాలిచ్చింది.

తడిసిన ధాన్యం..

ఇప్పటికే వరి, మొక్కజొన్న ధాన్యాలను మార్కెట్లు, కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చారు. ఈ తుఫాను కారణంగా చాలాచోట్ల ధాన్యం తడిసి ముద్దయ్యింది. రహదారులపై ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఈదురుగాలులు, వర్షానికి చెల్లాచెదురైంది. ఇప్పటికే వర్షాల వల్ల దిగుబడి తగ్గిందని, ప్రస్తుతం తుఫానుతో తమకు నష్టం మిగిలిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పలుచోట్ల పరిస్థితి..

మోస్తరు వర్షానికి కల్హేర్ సమీపంలోని నల్లవాగు, కాకివాగు సంగమమైన మహారాజు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది.

నారాయణఖేడ్ మండల పరిధిలోని వెంకటాపూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద, నిజాంపేట మండలం మునిగేపల్లి రోడ్డు గుండా ఆరబెట్టిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పినా కింది నుంచి వర్షపు నీరు పారి తడిసిముద్దయ్యాయి.

హవేళిఘణపూర్ మండల పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు ఇవ్వకపోవడంతో వానకు ఆరబెట్టిన ధాన్యం తడుస్తోంది. అద్దెకు తెచ్చిన టార్పాలిన్‌లను రాసులపై కప్పి, అందులోనే ఆరపెడుతున్నారు.

వెల్దుర్తి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల మధ్య వర్షపు నీరు చేరింది. దీంతో నీరు తొలగించడానికి రైతులకు తిప్పలు తప్పడం లేదు.

మునిపల్లి మండలంలోని బుసారెడ్డిపల్లి చౌరస్తా నుంచి సింగూరుకు వెళ్లే సింగూరు రహదారి అధ్వానంగా మారింది. ప్రస్తుత వర్షాలకు రోడ్డుపై నీళ్లు చేరి నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది.



వర్షం నీరు ఇలా.. బడికి వెళ్లేదెలా?

సంగారెడ్డిలో కురిసిన వర్షానికి పాత బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణం వర్షం నీటితో చెరువును తలపిస్తున్నది. విద్యార్థులు లోపలికి రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారు. అలాగే పాఠశాల ప్రాంగణం బురదగా మారడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇబ్బందులు పడ్డారు.

- సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి)

మెరుగైన సేవలందించేందుకు చర్యలు

● నారాయణఖేడ్ డీఎం సుబ్రహ్మణ్యం

నారాయణఖేడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ఆర్టీసీ డీఎం సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. కంగ్టికి చెందిన సంతోష్ కంగ్టి మీదుగా నిజామాబాద్‌కు, కృష్ణాపూర్‌కు చెందిన శేఖర్ కామారెడ్డి, ఆర్మూర్‌లకు, రేగోడుకు చెందిన బస్వరాజ్, రేగోడు మీదుగా హైదరాబాద్‌కు బస్సులు నడపాలని ఫోన్‌చేసి కోరారు. ఆయా సమస్యలను నమోదు చేసుకున్న డీఎం ప్రయాణికులు తెలిపిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

ముత్తంగి నర్సింగ్ స్కూల్‌పై కేసు పెట్టాలి

పటాన్‌చెరు అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించిన నర్సింగ్ పాఠశాలలపై కేసులు పెట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ అన్నారు. బుధవారం పటాన్‌చెరులో డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముత్తంగిలోని దేవి నర్సింగ్ స్కూల్ యాజమాన్యం ఒకే భవనంలో తరగతులు, వసతి రెండూ నడిపిస్తున్నారని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బోధనా సిబ్బంది అమ్మాయిలపై ఇష్టారీతిన పెత్తనం చేస్తున్నారని తెలిపారు. నిబంధనలు పాటించని వాటిపై కేసులు నమోదు చేసేటట్టు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసు, అనిల్, శ్రీకాంత్, పావని, లావణ్య, సురేష్, అశ్విని, సుధ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

నారాయణఖేడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపల్ పరిధిలో గృహాల నిర్మాణాలకు సంబంధించి మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించొద్దని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు అవసరమైన వారు బిల్డ్‌నౌలో ఆన్‌లైన్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫీజులను సైతం ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉంటే దరకాస్తు చేసిన 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తామన్నారు. దరఖాస్తుదారులకు ఏమైనా అనుమానాలు, సందేహాలు ఉంటే తనను కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని సూచించారు.

సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కంగ్టి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : 15వ విడత ఉపాధిహామీ పనులపై చేపట్టే సామాజిక తనిఖీపై ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ సిబ్బంది ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఎస్ఆర్‌పీ కొమురయ్య, ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో నర్సింలు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

● ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భిక్షాటన

నారాయణఖేడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లింపుల పరిష్కారం కోసం బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దత్తురెడ్డి మాట్లాడుతూ ఉపకార వేతనాలు, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.8,500 కోట్లు పేరుకుపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుప్పాల అభిషేక్, రోహిత్, చరణ్, ఇసాక్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఝరాసంగం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : 'సోయా రైతు నిలువు దోపిడీ' అనే శీర్షికన ఈ నెల 23న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతరావుపాటిల్ మాట్లాడుతూ రైతులు సోయా ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా సోయా కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.5,328 ధర చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, పీఏసీఎస్ చైర్మన్ గౌసోద్దీన్, డైరెక్టర్ నిస్సార్ ఫైమాద్ తదితరులు పాల్గొన్నారు.

'పట్టా భూమి అసైన్డ్‌గా చూపిస్తుంది'

రేగోడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టా భూమి ఆన్‌లైన్‌లో అసైన్డ్ భూమిగా చూపిస్తుందని పోచారం గ్రామానికి చెందిన ఖాజాబీ బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. రేగోడు మండలంలోని మర్పల్లి గ్రామ శివారులో 190 సర్వే నెంబరు పట్టా భూమి అసైన్డ్ భూమిగా వచ్చిందని, పట్టా భూమిగా మార్చాలంటూ తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసింది. అయినాఆ మార్పు కాలేదని వాపోయింది. అధికారులు సర్వే చేసి పట్టా భూమిగా మార్చాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

పుల్‌కల్/నారాయణఖేడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పుల్కల్‌కు చెందిన గాండ్ల మాణెమ్మకు రూ.29 వేలు, నంది ప్రతాప్‌రెడ్డి, నంది మాణిక్యరెడ్డికి రూ.60 వేల చొప్పున మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు బోయిని శ్రీనివాస్‌ముదిరాజ్ బుధవారం అందజేశారు. అలాగే నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్‌కు చెందిన సాయిగొండకు రూ.60 వేలు, ఖేడ్ మండల పరిధిలోని పలుగుతండాకు చెందిన కర్రరాజునాయక్‌కు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ జిల్లా నాయకుడు సుధాకర్‌రెడ్డి పంపిణీ చేశారు.